

మామునూరు ఎయిర్‌పోర్ట్‌లోని రన్‌వే (ఫైల్)

- 150 కిలోమీటర్ల పరిధి నిబంధన సడలింపు
- కేంద్రంతో జీఎంఆర్ సంస్థ ఒప్పందం
- ఎన్‌వోసీపై ఉత్తర్వులు జారీ
- ఎయిర్‌పోర్టు అభివృద్ధికి కీలక నిర్ణయం
- త్వరలోనే సర్వీసుల పునరుద్ధరణ పనులు



## మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు
# గ్రీన్ సిగ్నల్

వరంగల్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్ నగర సమీపంలోని మామూనూరు ఎయిర్ పోర్టు అభివృద్ధి, విమాన సర్వీసుల పునరుద్ధరణకు అడ్డంకులు తొలగిపోయాయి. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో మరో ఎయిర్‌పోర్టు ఉండకూడదనే నిబంధన రద్దయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (హెచ్‌ఏఐఎల్)ను నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో ఒప్పందం అనంతరం ఈ నిర్ణయం జరిగిందని పేర్కొన్నది. మామునూరు ఎయిర్‌పోర్టులో సర్వీసుల పునరుద్ధరణకు అడ్డంకిగా ఉన్న 150 కిలోమీటర్ల నిబంధనను తొలగించేలా ఏర్పాట్లు చేయాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కు ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ అధికారుల చర్చల అనంతరం జీఎంఆర్ సంస్థ నిబంధన సడలింపునకు అంగీకారం (ఎన్‌వోసీ) తెలిపింది. దీనిని ధ్రువీకరిస్తూ కేంద్ర పౌరవిమానయాన మంత్రిత్వశాఖ కార్యదర్శి అమిత్ కుమార్‌ఝూ ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్‌కు లేఖ రాశారు. తాజా నిర్ణయంతో మామునూరు విమానాశ్రయంలో సర్వీసుల పునరుద్ధనకు అవసరమైన పనులు చేపట్టనున్నారు.

### బీఆర్ఎస్ హయాంలో అడుగు

ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ మామునూరు ఎయిర్‌పోర్టును నిర్మించారు. 1930లో దీని కార్యకలాపాలు మొదలయ్యాయి. నిజాం సర్కారులో వరంగల్ సుబేదార్ (ప్రాంతీయ కేంద్రం)గా ఉండగా అప్పుడు అజంజాహి టెక్స్‌టైల్ మిల్లును ఏర్పాటు చేశారు. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి మామునూరు ఎయిర్‌పోర్టుకు వాయుదూత్ పేరుతో విమాన సర్వీసులు నడిచేవి. 1981 వరకు ఇక్కడ సర్వీసులు కొనసాగాయి. ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాల నిర్లక్ష్యం, కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఈ సేవలు నిలిచిపోయాయి. ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, అవసరమైన భూ సేకరణ కోసం 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికతో ఇప్పుడు కీలక నిర్ణయాలు జరిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రయత్నంతో 2022లో కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్ పోర్టును ఉడాన్ పథకంలో చేర్చింది. ఎయిర్‌పోర్టు అభివృద్ధి లక్ష్యంగా 2023లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త బృందం ఏర్పాటు కాగా, పునరుద్ధరణకు అవసరమైన నిర్ణయాలు, నిధులు, భూసేకరణపై నివేదిక రూపొందించింది. రూ.592 కోట్లతో దీన్ని అమలు చేయాలని పేర్కొన్నది. మామునూరు ఎయిర్‌పోర్టుకు మొదటి నుంచి 696 ఎకరాల భూమి ఉండగా, మరో 253 ఎకరాల భూమి అవసరమవుతుందని సంయుక్త కమిటీ సూచించింది. ఈ మేరకు భూమి సేకరణ కోసం 2024 నవంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేసింది. విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం మామునూరు ఎయిర్‌పోర్టులో 2.9 కిలోమీటర్ల పొడవుతో రన్‌వే విస్తరించనుండగా, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు జరుగనున్నాయి.

### పిల్ల కాల్వలు గాలికి..

దేవాదుల ఉత్తర కాల్వ నాలుగు మండలాల పరిధిలో ఉండగా, 119 కిలోమీటర్ల మేర పిల్ల కాల్వలు తవ్వారు. అయితే ఈ కాల్వల్లో నీరు రాకపోవడంతో కొందరు రైతులు చదునుచేసుకున్నారు. ఎల్కతుర్తి మండలంలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు కాల్వల అలైన్‌మెంట్‌ను ఇష్టారీతిగా మార్చేశారు. ఇందుకోసం నీటి పారుదల శాఖ అధికారులకు భారీగానే ముడుపులు ముట్టినట్లు ఆరోపణలున్నాయి. దీనికి తోడు పలువురు గ్రానైట్ యజమానులు కాల్వలపైనే నిర్మాణాలు చేపట్టగా మరికొందరు డస్ట్ నింపుతున్నారు. ఈ విషయమై రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అయితే పిల్ల కాల్వల మరమ్మతులు ఉపాధి హామీ పథకంలో చేసుకోవాలని ఎంపీడీవోలకు సూచించినప్పటికీ వారు స్పందించడం లేదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ కాల్వల కింద ఆయకట్టు కాగితాల్లోనే కనిపిస్తున్నదని, క్షేత్రస్థాయిలో మాత్రం సగం కూడా పారడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు పిల్ల కాల్వలను పట్టించుకోక, నీటి విడుదలలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో యాసంగి పంటలు ఎండుతున్నాయని వారు వాపోతున్నారు.

### ఒక్కసారి కూడా నీళ్లు రాలే..



నేను బడికి పోయేటప్పుడు ఈ దేవాదుల కాల్వను తవ్విండ్రు. ఇగ మనకు సావు లేదు.. నీళ్లు వస్తయని మా బాపు చెప్పెటోడు. ఇన్నేండ్లు గడిచినా ఇప్పటికైతే నేను నీళ్ల సుక్క సూడలేదు. భవిష్యత్తులో వస్తయనే నమ్మకం లేదు. గ్రానైట్ కంపెనోళ్లు ఇష్టం వచ్చినట్లు కాల్వల డిజైన్లు మార్చుతున్నరు. ఎవరూ పట్టించుకుంటలేరు.

– కొమ్మిడి రమణారెడ్డి, రైతు, ఎల్కతుర్తి



కాల్వపై అక్రమ నిర్మాణాలు

పంటలకు చేరని దేవాదుల నీరు

# దేవా.. దిక్కెవరు?



డిస్ట్రిబ్యూటరీ 7 వద్ద కానరాని షట్టర్



గ్రానైట్ డస్ట్‌తో పూడ్చివేసిన పిల్ల కాల్వ

- ఉత్తర కాల్వ నిండా సిల్ట్, పిచ్చి మొక్కలు
- మూసుకుపోయిన పిల్ల కాల్వలు
- ఇష్టారీతిన అలైన్‌మెంట్ల మార్పులు
- కాల్వలపైనే పలు నిర్మాణాలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- చుక్క నీరు రాక ఎండుతున్న యాసంగి పంటలు

హనుమకొండ సబర్బన్, ఫిబ్రవరి 28 : తెలంగాణ ఉద్యమ ఉధృతిని తట్టుకోలేక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జే చొక్కారావు(దేవాదుల) లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రారంభించారు. ఇది రెండు దశల నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ కేటాయించిన ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీ రందించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై, సీఎంగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ములుగు జిల్లా కన్నాయిగూడెం వద్ద గోదావరి నదిపై సమ్మక్క బరాజ్ నిర్మించి పూర్తి స్థాయిలో రైతులకు సాగునీ రందించారు. ఇందులో భాగంగానే హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్ రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచి ఉత్తర, దక్షిణ కాల్వలకు నీటిని సరఫరా చేశారు. అయితే ఆ కాల్వలు ఇప్పుడు లక్ష్యానికి ఆమడ దూరంలో ఉన్నాయి. ముఖ్యంగా ధర్మసాగర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలాల్లోని 15 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు ఉత్తర కాల్వను నిర్మించారు. 24 కిలోమీటర్ల వరకు ప్రధాన కాల్వ తవ్వగా దానికి 13 డిస్ట్రిబ్యూటరీలు ఏర్పాటు చేశారు. ఇందులో సగం మేరకు కాల్వల షట్టర్లు మరమ్మతులో ఉండగా, డిస్ట్రిబ్యూటరీ 7లో షట్టరే లేదు. దీంతో నీరు మొత్తం వృథాగా పోతున్నది. ప్రధాన కాల్వ మొత్తం సిల్ట్, ముళ్ల పొదలతో మూసుకుపోయింది. సిమెంట్ స్ట్రక్చర్లకు ఇష్టారీతిన రంధ్రాలు వేశారు. గతంలోనే ప్రధాన కాల్వ రిపేరుకు ప్రతిపాదనలు పంపగా ఇటీవలే రూ. 26 లక్షలు మంజూరయ్యాయి.

### 'ఉపాధి'లో మరమ్మతు చేయమన్నాం..

దేవాదుల ఉత్తర ప్రధాన కాల్వ పరిధిలో 119 కిలోమీటర్ల మేర పిల్ల కాల్వలు ఉన్నాయి. ఇవి మూసుకుపోయిన చోట ఉపాధి హామీ పనులు కేటాయించి మరమ్మతు చేయించాలని దీని పరిధి ఎంపీడీవోలకు ఏడాది నుంచి చెబుతున్నాం. అయితే అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చ లేదు. ఈసారి కూడా చెప్పాం. ప్రధాన కాల్వ రిపేరుకు మాత్రం రూ. 26 లక్షలు మంజూరయ్యాయి.

– ప్రశాంతి, డీఈ, నీటిపారుదల శాఖ

# టీచర్స్ ఎమ్మెల్సీ ఎవరో ?

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- తుది పోలింగ్ 93.57 శాతం
- కీలకం కానున్న ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు
- ఈ నెల 3వ తేదీ నుంచి ఓట్ల లెక్కింపు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి28(నమస్తే తెలంగాణ) : అత్యంత ఉత్కంఠత రేకెత్తిస్తున్న వరంగల్–ఖమ్మం–నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఇప్పుడు అందరి అంచనాలు గెలుపోటములపైకి మళ్లాయి. పోలింగ్ సరళిని విశ్లేషిస్తూ ప్రధాన అభ్యర్థులంతా శుక్రవారం జిల్లాల వారీగా పరిస్థితిని సమీక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం తెల్లారుజామున వెల్లడైన వివరాల ప్రకారం.. తుది పోలింగ్ 93.57 శాతంగా నమో దైంది. ఈ నెల 3వ తేదీన కౌంటింగ్ జరుగనుంది. సోమవారం మధ్యాహ్నం వరకే ఫలితాల సరళి వెల్లడికానుంది. పోలింగ్ నాటి సరళిని పరిశీలిస్తే ప్రథమ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో విజేత తేలకపోవచ్చని, ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తప్పనిసరి కానుందని తెలుస్తోంది. ఇక ఇదే సమయంలో ప్రధాన అభ్యర్థులు గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ఎలిమినేషన్ రౌండ్స్ వరకు వస్తే గానీ విజేత తేలక పోవచ్చన్న అంచనాలు లేకపోలేదు.




స్ట్రాంగ్ రూం వద్ద బందోబస్తులో ఉన్న పోలీస్

#### నువ్వానేనా అన్నట్లుగా..

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గతంలో ఎన్నడూలేని విధంగా ఈ సారి టఫ్ ఫైట్ నెలకొన్నట్లుగా పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. 2013, 2019 టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ద్విముఖ పోరు కొనసాగగా ఈ సారి మాత్రం అందుకు భిన్నంగా బహుముఖ పోటీ తెరపైకి వచ్చింది. సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్ రెడ్డిల మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉంటుందన్న అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. టీచర్స్ జాక్ అభ్యర్థిగా రంగంలో నిలిచిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సైతం బలమైన బీసీవాదంతో పాటు గతంలో పీఆర్‌టీయూలో కీలక నేతగా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం, నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లకు సుపరిచితం లాంటి అంశాలన్నీ తన విజయానికి దోహదం చేస్తాయన్న అంచనాలో ఉన్నారు. పీసీసీ అధికార ప్రతినిధి, పీఆర్‌టీయూ మాజీ నేత గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కూడా తనదే విజయమని భావిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి కూడా ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన జాతీయ వాదం, బీజేపీ మద్దతు, ఉపాధ్యాయ మాజీ నేతగా అనుభవం తదితర అంశాలతో గెలుపుపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

#### కీలకంగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు

పోలింగ్ సరళిని బట్టి తొలి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలదన్నది స్పష్టమవుతున్నది. ఈ నేపథ్యంలో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు కీలకం కానున్నాయి. ప్రలోభాల పర్వం ప్రభావం ఓటర్లపై ఎక్కువగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ ఫలితం తేలక ఎలిమినేషన్ రౌండ్స్‌కు కౌంటింగ్ దారి తీయవచ్చన్న అంచనాలు లేకపోలేదు.

#### స్వల్పంగా పెరిగిన పోలింగ్ శాతం

గురువారం సాయంత్రం 4 గంటల తర్వాత వెల్లడించిన ఓటింగ్‌కు, నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం తెల్లారుజామున వెల్లడైన పోలింగ్ శాతంలో స్వల్ప పెరుగుదల కనిపించింది. తుది పోలింగ్ 93.57 శాతంగా నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 25,797 మంది ఓటర్లుండగా, 24,139 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 12 జిల్లాల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉండగా సిద్దిపేటలో 93.98 శాతం, జనగామలో 94.31శాతం, హన్మకొండలో 91.66 శాతం, వరంగల్‌లో 94.09 శాతం, మహబూబాబాద్‌లో 94.47శాతం, భూపాలపల్లిలో 94.22 శాతం, ములుగులో 92.83 శాతం, భద్రాద్రి కొత్తగూడెంలో 91.94 శాతం, ఖమ్మంలో 93.05 శాతం, యాదాద్రిలో 96.54 శాతం, సూర్యాపేటలో 94.97 శాతం, నల్లగొండలో 94.75 శాతం నమోదైంది. కాగా గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి 3.16 శాతం పోలింగ్ పెరిగింది.



జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సినీనటుడు బ్రహ్మానందం

- నిట్‌లో ప్రారంభమైన వసంతోత్సవం
- స్ప్రింగ్ స్ప్రీ-25లో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు
- ఉత్సాహం నింపిన హాస్యనటుడు బ్రహ్మానందం స్పీచ్
- గొప్ప దర్శకులుగా ఎదగాలి : బింబిసార డైరెక్టర్ వశిష్ట

## అట్టహాసంగా
# సాంస్కృతిక సంబురం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 28: వరంగల్ జాతీయ సాంకేతిక కళాశాల(నిట్)లో సాంస్కృతికోత్సవం(స్ప్రింగ్ స్ప్రీ-25) శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ నిట్ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులతో సందడిగా మారింది. వీరు నేటి నుంచి సంగీతం, నృత్యం, నాటకం, ఇతర సాంస్కృతిక పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. మధ్యాహ్నం ఆడిటోరియంలో పద్మశ్రీ, సినీ హాస్యనటుడు డాక్టర్ కే బ్రహ్మానందం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం స్పీచ్ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తూ, వారిలో ఉన్న ప్రతిభను ప్రదర్శించే గొప్ప వేదికగా స్ప్రింగ్ స్ప్రీ–25 నిలుస్తుందన్నారు. విద్యార్థులు తమ విశేష ప్రతిభను ప్రదర్శించి వరంగల్ నిట్ ఖ్యాతిని మరింత పెంచాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసచార్య, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పీ శ్యామ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ (సాంస్కృతిక) ప్రొఫెసర్ బీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

#### ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు.. శాల్తీ లేచిపోతుంది : బ్రహ్మానందం

'ఖాన్‌తో గేమ్స్ ఆడొద్దు.. శాల్తీ లేచిపోతుంది..' అంటూ పద్మశ్రీ, హాస్యనటుడు బ్రహ్మానందం విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. చాలా పేదరికం నుంచి తాను వచ్చానని, ఆరుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లను అప్పుడు చదివించాలంటే చాలా కష్టపడేవారని, ఎన్నో అడ్డంకులు, అవహేళనను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానన్నారు. ప్రస్తుత సమాజం నీ దగ్గర డబ్బు ఉంటేనే గౌరవం ఇస్తుందని, అందుకే కృషి, పట్టుదల, సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు అనుకున్నది ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తూ వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 40 ఏళ్ల సినీ పరిశ్రమలో 1200కు పైగా చిత్రాల్లో నటించానని, ప్రపంచంలోనే అత్యధికంగా సినిమాలు తీసిన వ్యక్తిగా నిలిచిపోయానన్నారు. ఆశీర్వదించడానికి, అభినందించడానికి వయసు ముఖ్యం కాదని, మంచి మనస్సు ఉండాలని నిట్ విద్యార్థుల ఆశీస్సులు తీసుకుందామని ఆరోగ్యం సహకరించకపోయినా వారి కోసం వచ్చినట్లు చెప్పారు. అందరూ బ్రహ్మ'ఆనందంగా' ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రముఖ దర్శకుడు వశిష్ట(బింబిసార, విశ్వంభర చిత్రాల దర్శకుడు) తన సినీ ప్రయాణం, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. గొప్ప దర్శకులుగా ఎదగాలని వారిని ప్రోత్సహించారు. విద్యార్థులు, అభ్యాసకులు రూపొందించిన షార్ట్‌ఫిల్మ్స్‌పై వశిష్ట అభిప్రాయాలు వ్యక్తం చేసి, అభ్యాసకులకు మార్గనిర్దేశం చేశారు.




వరంగల్ నిట్‌లో స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలకు హాజరైన కళాశాలల విద్యార్థులు

## ప్రతాపగిరి అడవుల్లో
# పులి సంచారం

- భయాందోళనలో గ్రామస్తులు
- అప్రమత్తంగా ఉండాలని సూచించిన అధికారులు

కాటారం, ఫిబ్రవరి 28 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మళ్లీ పులి సంచరిస్తున్నది. గత 15 రోజులుగా కాటారం సబ్ డివిజన్ అడవుల్లో తిరుగుతున్న పులి శుక్ర వారం ప్రతాపగిరి అడవుల్లోకి వచ్చినట్లు సమాచారం. మహాదేవపూర్ మండలంలోని రాపల్లి కోట అటవీ ప్రాంతం నుంచి ప్రతాపగిరి గుట్ట వైపునకు వచ్చినట్లు సమాచారంతో అటవీ అధికారులు వెళ్లి పరిశీలించారు. పలుచోట్ల పులి పాదముద్రలు కనిపించాయి. పులి సంచరిస్తుందన్న సమాచారంతో ప్రతాపగిరి, మద్రిపల్లి, పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతంలోకి ఎవరూ వెళ్లవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు.



ధర్నా విరమించాలని వడ్లకొండ గ్రామ రైతులను కోరుతున్న సీఐ దామోదర్ రెడ్డి


# సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

### జనగామ-హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా

జనగామ రూరల్, ఫిబ్రవరి28 : పంటలకు సాగు నీరందించాలని డిమాండ్ చేస్తూ జనగామ మండలం వడ్లకొండ గ్రామంలో శుక్రవారం రైతులు రోడ్డెక్కారు. జనగామ–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి జలాలు విడుదల చేస్తే చెరువులు, కుంటలకు నిండి పంటలకు చేరుతాయన్నారు. దీంతో పొట్టకు వచ్చిన వరి పంటకు జీవం పోసినట్లు ఉంటుందన్నారు. లక్షల్లో అప్పు చేసి పంట వేస్తే నీరు లేక కళ్ల ముందే ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం గోదావరి జలాలు విడుదల చేస్తే ఉన్న పంటలైనా కాపాడుకుంటామని పేర్కొన్నారు. ధర్నాతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి రైతులతో చర్చించి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో రైతులు కాయితపురం రామ్మోహన్ రెడ్డి, హరీశ్, నామాల భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

## శరవేగంగా
# పనులు

- రూ. 25.41 కోట్లతో వరంగల్ రైల్వే స్టేషన్ అభివృద్ధి
- అమృత్ భారత్ పథకం కింద ఆధునిక హంగులు
- 50 శాతం పూర్తయిందని అధికారుల వెల్లడి



వరంగల్ రైల్వే స్టేషన్ నమూనా చిత్రం

ఖిలావరంగల్, ఫిబ్రవరి 28: అమృత్ భారత్ పథకం కింద వరంగల్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. స్టేషన్ అభివృద్ధి కోసం కేంద్ర రైల్వే శాఖ రూ. 25.41 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే 50 శాతం పనులు పూర్తయినట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. మిగతా పనులు త్వరలోనే పూర్తి చేస్తామని ప్రకటించారు. అమృత్ భారత్ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 40 స్టేషన్లలో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో ముఖ ద్వారం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, ఎస్కలేటర్లు, పైకప్పు, మరుగుదొడ్లు, వెయిటింగ్ హాల్, పార్కింగ్, పచ్చదనం తదితర పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు సగటున 31,887 మంది ప్రయాణిస్తారని, వార్షిక ఆదాయం రూ. 41.09 కోట్లు వస్తుందని తెలిపారు.